క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన వైస్ ఎంపీపీ



మాజీ సీఎం జగన్‌తో వైస్ ఎంపీపీ వర్షిణి

రాజాం సిటీ: పాలకొండ పర్యటనకు వచ్చిన మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజాం మండలం, బొద్దాం గ్రామానికి చెందిన రాజాం వైస్ ఎంపీపీ నక్క వర్షిణి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జగనన్నను కలుసుకోవడం ఆనందంగా ఉందని, పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపానన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనం రుచి చూసి పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

రాజాం: పట్టణ పరిధిలోని డోలపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈవో యాగాటి దుర్గారావు గురువారం సందర్శించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరుతో పాటు పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాలు, రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులను నాణ్యమైన విద్యనందివ్వాలని, రుచి, శుచికరమైన భోజనాలు వండి పెట్టాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూసి, మెనూ ప్రకారం వంటకాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని చాటాయివలస, గుళ్లపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పద్మ తదితరులు గురువారం వెళ్లి, అక్కడి వేతనదారులకు ప్రకృతి సాగుపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడి అధిక ఆదాయం పొందాలంటే ప్రకృతి సేద్యాన్ని అనుసరించాలని, ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు.

ఉపాధి పనులపై సమీక్ష

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై ఎంపీడీవో ఎస్.రామకృష్ణ గురువారం సమీక్ష నిర్వహించారు. వారం రోజులుగా జరుగుతున్న పనులు ఏ విధంగా ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని, పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని, నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయిస్తూ రోజుకు రూ.270 నుంచి రూ.280 వేతనం గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స ఉండేలా చూడాలని ఎంపీడీవో తెలిపారు. సమావేశంలో ఏపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్‌తో మందుల పిచికారీ సులభం



డ్రోన్ పనితీరును వివరిస్తున్న అధికారులు

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో మొక్కజొన్న సాగులో డ్రోన్‌తో క్రిమిసంహారక మందుల పిచికారీపై గురువారం అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ మాట్లాడుతూ మొక్కజొన్న, చెరకు పంటల్లో తెగుళ్ల, వ్యాధుల నివారణకు మందుల పిచికారీ డ్రోన్లతో సులభంగా చేయవచ్చని రైతులకు తెలిపారు. వ్యవసాయ పనుల్లో డ్రోన్‌ల వినియోగం ద్వారా సమయం, డబ్బు రెండూ ఆదా అవుతాయన్నారు.

నిషేధిత పాలిథిన్ సంచులు విక్రయించొద్దు



రశీదులు అందజేస్తున్న సిబ్బంది

బొబ్బిలి: పట్టణంలో నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ సంచుల విక్రయాలపై సచివాలయ వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమిస్తూ పాలిథిన్ సంచులు విక్రయిస్తున్న పలువురు దుకాణాదారులకు అపరాధ రుసుం విధిస్తూ రశీదులు అందజేశారు. ఇకనుంచి ఎవరైనా నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లు అమ్మినా, కొనుగోలు చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అన్నదాతకు 'విశిష్ట గుర్తింపు'

- ఆధార్ తరహాలో రైతులకు భూ ఆధార్
- 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ
- ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు
- రిజిస్ట్రేషన్ అయితేనే ప్రభుత్వ పథకాలు



Farmer Registration Form

ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఫారం



రాజాం: రైతులకు ఆధార్ తరహాలో భూ ఆధార్ కార్డు జారీ చేస్తున్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట చేపడుతున్న ఈ ప్రక్రియలో ప్రత్యేక యాప్‌లో సొంత భూమి కలిగిన ప్రతీ రైతు వివరాలు నమోదు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ అవుతుంది. ఇలా రిజిస్ట్రేషన్ అయితేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వ్యవసాయ సంబంధిత పథకాలు, రాయితీలు, సాగు యంత్రాలు, వ్యవసాయ పనిముట్లు అందించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో రైతుల నమోదు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. అన్నదాతలు కూడా రిజిస్ట్రేషన్‌కు సచివాలయాలకు క్యూ.. కడుతున్నారు. ఇప్పటివరకు రాజాం నియోజకవర్గంలో 200 వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి.

నమోదు ఇలా..

రైతులంతా భూ వివరాలు కలిగిన పాసుపుస్తకం, 1-బి, ఆధార్ కార్డు జిరాక్సులతో పాటు ఆధార్ లింక్ చేసిన ఫోన్ నంబర్‌ను గ్రామంలోని సచివాలయానికి అనుబంధంగా ఉన్న రైతు సేవా కేంద్రానికి తీసుకుని వెళ్లాలి. అక్కడి వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్) సంబంధిత పోర్టల్‌లో ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తారు. ఈ క్రమంలో మన ఫోన్ నంబర్‌కు వచ్చే మూడు ఓటీపీ(వన్ టైమ్ పాస్‌వర్డ్)లు చెప్పాల్సి ఉంటుంది. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ విజయవంతమైనట్లు ఫోన్‌కు సందేశం వస్తుంది. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఇలా నమోదు చేసుకుంటే ప్రభుత్వ పథకాలు పక్కాగా వర్తిస్తాయన్నారు. ఇక నుంచి మాకు ఈ పథకం రాలేదు.. ఆ పథకం రాలేదు.. పీఎం కిసాన్ డబ్బులు అందలేదన్న ఫిర్యాదులు రైతుల నుంచి ఉండవని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఇలా భద్రపరచాలి..

నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత రైతులకు జారీ చేసిన విశిష్ట గుర్తింపు సంఖ్యను ఫోన్‌లో కానీ పట్టాదారు పాసుపుస్తకంపై కానీ భద్రపరుచుకోవాలి. వీలైతే ఈ సంఖ్యను గుర్తుంచుకుంటే చాలావరకు మంచిది. ఒకవేళ గుర్తింపు సంఖ్య మర్చిపోయినా, పోయినా మళ్లీ రైతు సేవా కేంద్రానికి వెళ్లి, రైతు, తమ భూ వివరాలు ఇచ్చి తెచ్చుకోవచ్చు.

రైతులకు ప్రయోజనకరం..

ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా రైతులకు జారీ చేస్తున్న విశిష్ట గుర్తింపు సంఖ్య ద్వారా ఎంతో ప్రయోజనం. ఆధార్ నంబర్ బట్టి మన వివరాలు ఏ విధంగా వస్తాయో అలాగే రైతుల 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య ద్వారా రైతు, ఆయన చేస్తున్న పంటల సాగు వివరాలు, ఆయన పొందుతున్న వ్యవసాయ పథకాలు తెలుస్తాయి. ఏ పథకానికి రైతు అర్హుడో కూడా తెలుస్తుంది. ప్రస్తుతం అన్నిచోట్ల నమోదు ప్రక్రియ జరుగుతోంది. రైతులంతా ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి.

– కె.చంద్రరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ, రాజాం.

ఎస్‌డబ్ల్యూపీసీలను సక్రమంగా నిర్వహించాలి



గురవాంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు)లు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని గురవాం ఎస్‌డబ్ల్యూపీసీని గురువారం సందర్శించిన ఆయన.. గ్రామంలో ఇంటింటి నుంచి సేకరిస్తున్న చెత్తను కేంద్రానికి తరలించి, వర్మీకంపోస్ట్ తయారు చేయాలని తెలిపారు. చెత్త సంపద కేంద్రాల్లో తయారు చేసిన ఎరువును రైతులకు సబ్సిడీపై అందజేయాలని, తద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. అనంతరం కంచరాం, అంతకాపల్లి గ్రామాలకు వెళ్లి, అక్కడి క్లాప్‌మిత్రలకు చెత్త సేకరణపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి దిలీప్ తదితరులు ఉన్నారు.

వంగర: మండలంలోని ఎస్.ఎస్.ఆర్.పురం, తలగాం, కొప్పరవలస, కొండచాకరాపల్లి గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను ఈవోపీఆర్‌డీ కె.రామారావు గురువారం సందర్శించారు. ఆయా కేంద్రాల మరమ్మతులను 15వ ఆర్థిక సంఘం నిధులతో చేసి, కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

బయోమైనింగ్ పరిశీలన



బయోమైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: స్థానిక పట్టణ సమీపంలోని కృష్ణాపురం రోడ్డులో చెత్తను బయోమైనింగ్ చేసే పనులను మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి గురువారం పరిశీలించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సూచనల మేరకు మొత్తం 4.10 ఎకరాల విస్తీర్ణంలో 14,711 మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ చేయడానికి ఇక్కడి పాత డంపింగ్‌యార్డును కేటాయించారు. ఇక్కడి చెత్త బయోమైనింగ్ పనులను మెస్సర్ తరుణి అసోసియేట్స్ ఏజెన్సీకి అప్పగించారు. ఈ మేరకు ఆమె బయోమైనింగ్ మెషినరీ పెట్టుకునేందుకు స్థలం, ప్రాసెస్‌కు అవసరమైన నీరు, 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను మున్సిపాలిటీ ద్వారా అందజేశామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఇక్కడ రోజుకు 160 టన్నుల చెత్తను ప్రాసెస్ చేస్తున్నామని, ప్రాసెస్ అయిన చెత్తను గ్రేడింగ్‌ల ద్వారా పల్లపు ప్రాంతాల్లో వేసేందుకు, జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలించేందుకు పనులు జరుగుతున్నాయన్నారు. ఆమె వెంట పర్యావరణ ఇంజినీర్ సోమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

బకాయి వేతనాలు ఇవ్వాలి



తమకు అందివ్వాల్సిన బకాయి వేతనాలు ఇవ్వాలని షిఫ్ట్ ఆపరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారంతా రాజాం మండలంలోని శ్యాంపురంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. డిసెంబరు నెల నుంచి తమకు జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ కష్టమవుతోందని, వీలైనంత త్వరగా జీతాలు అందేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. – రాజాం సిటీ

పిల్లలను సన్మార్గంలో నడపాలి



పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా మెలగాలని, వారిని సన్మార్గంలో నడిపించాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్ కుమార్ సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా రాజాం మండలం, బొద్దాం గ్రామంలో పిల్లల మంచి నడవడికపై గురువారం అవగాహన కల్పించారు. చిన్నతనం నుంచే పిల్లల ప్రవర్తనను గమనించాలని, చెడు అలవాట్లకు అలవాటు పడుతున్నట్లు తెలిస్తే వారిని మంచి ప్రవర్తన వైపు నడిపించాలని తెలిపారు. చెడు వ్యసనాలకు గురై, ఎంతోమంది యువత, విద్యార్థులు తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు సత్ప్రవర్తన నేర్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. – రాజాం సిటీ

సిమెంట్ బస్తాలు ఏమయ్యాయ్?



బాడంగి మండలం, మల్లంపేటలో సిమెంట్ బస్తాల మిస్సింగ్‌పై హౌసింగ్ పీడీ కూర్మనాయుడు, ఈఈ రంగారావులు గురువారం విచారణ చేపట్టారు. సిమెంట్ బస్తాలు ఏమయ్యాయని లబ్ధిదారులు, గ్రామస్తులను ఆరాతీశారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామానికి చెందిన వంగపండు సూరమ్మ, మెరపల కళావతిలకు ఇళ్లు మంజూరై, నిర్మాణ పనుల నిమిత్తం ఒక్కొక్కరికి 20 బస్తాల చొప్పున మొత్తం 40 బస్తాల సిమెంట్ ఇచ్చారు. అయితే అవి వారికి అందలేదని వారు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారుల బృందంతో ఓ కమిటీ వేసి, విచారణ చేపట్టారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు శుక్రవారం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. – బాడంగి

చట్టం ముందు అందరూ సమానులే..



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

రాజాం సిటీ: చట్టం ముందు అందరూ సమానులేనని మండల న్యాయసేవాధికా సంఘం అధ్యక్షురాలు, సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక జీసీఎస్ఆర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగం ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కల్పించిందని, దానికి అనుగుణంగా చట్టాలు రూపొందించడం జరిగిందని తెలిపారు. 14 ఏళ్ల వయసులోపు చిన్నారులకు ఉచిత నిర్బంధ విద్యను ప్రవేశపెట్టారని, అలాగే పనులు చేసిన చోట లింగ బేధం లేకుండా వేతనాలు కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులంతా బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. సదస్సులో టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆర్ఈసీహెచ్ జయదేవ్, ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



ఇసుకపై టార్పాలిన్ కప్పాలని సూచిస్తున్న సీఐ అశోక్‌కుమార్

రాజాం సిటీ: వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. స్థానిక పట్టణంలోని బొబ్బిలి, పాలకొండ జంక్షన్‌ల వద్ద పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. గురువారం చేపట్టిన తనిఖీల్లో వాహనాల పెండింగ్ చలాన్లు పరిశీలించి, ఎవరివైనా చలాన్లు పెండింగ్ ఉంటే వాటిని చెల్లించాలని లేకపోతే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే ఇసుక రవాణా చేస్తున్న వారు తమ వాహనంపై ఉన్న ఇసుకపై టార్పాలిన్లు కప్పాలని తెలిపారు. చిన్నారులకు వాహనాలు ఇస్తే సంబంధిత తల్లిదండ్రులే శిక్షార్హులన్నారు.

టీడీపీది వక్రభాష్యం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రేగిడి:

ఉపాధి హామీ పథకం పనులపై ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై టీడీపీ వక్రభాష్యం చెబుతోందని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, లక్ష్మీపురం సర్పంచ్ కెంబూరి తేజోవతిలు విమర్శించారు. ఇదే విషయమై వారు గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 40 శాతం ఉపాధి పథకం మెటీరియల్ పనులను చట్టానికి వ్యతిరేకంగా వెండర్ పేరిట టీడీపీ కార్యకర్తలకు ఇస్తూ గ్రామ పంచాయతీ హక్కులు కాలరాస్తోందని ధ్వజమెత్తారు. మండలంలోని లక్ష్మీపురం, మునకలవలస, గుళ్లపాడు పంచాయతీల సర్పంచ్‌లు ఇటీవల కోర్టును ఆశ్రయించగా, ఈ నెల 5న తీర్పు వెలువడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన మెమో విరుద్ధమని, పిటిషన్ వేసిన రిట్‌ను అనుమతిస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ హైకోర్టుకు సమర్పించిన కౌంటర్ అఫిడవిట్‌లో వెండర్లు కేవలం సప్లయర్లు మాత్రమేనని, వారితో పనులు చేయించడం లేదని అంగీకరించారు. ఇంజినీరింగ్ అధికారులు మాత్రం కొలతలు పుస్తకం, కాంట్రాక్ట్ బిల్లు ఫారంలో కాంట్రాక్టర్లను వెల్డర్లుగానే చూపించారన్నారు. ఈ అంశంపై అధికారులు స్పందించాల్సి ఉండగా, టీడీపీ నాయకులు స్పందించడం విడ్డూరంగా ఉందన్నారు. హైకోర్టు తీర్పును అమలు చేయకుంటే కోర్టు ధిక్కరణ కింద మరోసారి కోర్టును ఆశ్రయిస్తామన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తెర్లాం: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రేగి రాంబాబు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

పంపిణీకి గడ్డివిత్తనాలు సిద్ధం

తెర్లాం: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీపై పంపిణీ చేసేందుకు గడ్డి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల పశు వైద్యాధికారి జె.నరేంద్రకుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. జొన్న రకం గడ్డి విత్తనాలకు ప్రభుత్వం 75 శాతం రాయితీ ఇచ్చిందన్నారు. 5 కేజీల జొన్న గడ్డి విత్తనాలు రూ.460లు కాగా, 75 శాతం సబ్సిడీపై కేవలం రూ.115లు మాత్రమే చెల్లించి కొనుగోలు చేసుకోవచ్చన్నారు. గడ్డి విత్తనాలు కావాల్సిన రైతులంతా సచివాలయ పశు సంవర్ధక శాఖ సహాయకులను సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా బంగారమ్మ సంబరాలు

వంగర: మండలంలోని కె.కొత్తవలస గ్రామంలో శ్రీబంగారమ్మ, చినప్పమ్మ పేరంటాలు సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం మొక్కులు సమర్పించుకున్నారు. వేడుకల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

రామభద్రపురం: మండలంలోని కొత్తరేగ గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఐ ప్రసాదరావు సిబ్బందితో కలిసి గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.7 వేలు స్వాధీనం చేసుకున్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం కావాలి



పదో తరగతి ప్రత్యేక తరగతులను తనిఖీ చేస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం కావాలని, ఆ దిశగా విద్యార్థులను సంసిద్ధులను చేయాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని పెరుమాళి గ్రామంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన గురువారం తనిఖీ చేశారు. ప్రతీ విద్యార్థి ప్రతీ సబ్జెక్టులో వందకు వంద శాతం మార్కులు తెచ్చుకోవాలన్న పట్టుదలతో చదవాలన్నారు. విద్యార్థుల శతశాతం ఉత్తీర్ణతకు 100 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వృత్తి నైపుణ్య శిక్షణ



తెర్లాం: తయారు చేసిన బోధనా సామగ్రితో అంగన్‌వాడీ కార్యకర్తలు

జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. అన్ని మండల కేంద్రాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణా తరగతుల్లో కేంద్రాల్లో ప్రీ స్కూల్ నిర్వహణ, చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. గురువారం ప్రీస్కూల్ పిల్లలకు చేసే విద్యాబోధనలో పాటించాల్సిన మెలకువలను వివరించారు.

– రాజాం, రేగిడి, తెర్లాం



రేగిడి: అంగన్‌వాడీ కార్యకర్తలకు బోధనా మెలకువలు నేర్పిస్తున్న ఎంఈవో ప్రసాదరావు



రాజాం: శిక్షణార్థులకు సూచనలిస్తున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్



రాజాం: వన్నలి నుంచి పయనమైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు



రాజాం: మారేడుబాక నుంచి పాలకొండకు బయలుదేరిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఉప్పొంగిన అభిమానం

రేగిడి/రాజాం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. పాలకొండ పర్యటనకు గురువారం ఆయన వస్తున్నారని తెలుసుకుని, ట్రాక్టర్లు, మ్యాక్సీక్యాబ్‌లు, ఆటోలు, బైక్‌లలో స్వచ్ఛందంగా వెళ్లి, తమ అభిమాన నాయకుడిని కళ్లార చూసి మురిసిపోయారు. జై జగన్.. జై వైఎస్సార్ సీపీ నినాదాలతో జనహృదయ నేతకు ఘనస్వాగతం పలికారు. మళ్లీ మీరే సీఎం..గా రావాలి.. మీరే మళ్లీ మళ్లీ సీఎం కావాలని మనసారా ఆకాంక్షించారు.